క్లుప్తంగా

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



రాధాకిషన్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

తొగుట(దుబ్బాక): నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీని ఎంపీడీవో శ్రీధర్, ప్రజాప్రతినిధులతో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్యుడు రాధాకిషన్‌తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఎద్దైనా సమస్య ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలని వైద్య సిబ్బందికి సూచించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాకిషన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లయ్య, నర్సింలు, ఎంపీటీసీ శరత్, మాజీ ఎంపీటీసీ రమేశ్, నాయకులు చంద్రారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

‘సిద్దిపేట ప్రభుత్వ పాఠశాల పరిస్థితి అధ్వానం’

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితి చాలా దారుణంగా ఉందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపికృష్ణ, అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్ అన్నారు. శనివారం యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. త్వరలో సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మున్నా, సలీం, తబ్రేజ్, జావీద్ పాల్గొన్నారు.

మార్కెట్ పరిశీలన



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సందర్శనలో విద్యార్థులు

సిద్దిపేటజోన్: పరిపూర్ణమైన ఆరోగ్యం, స్వచ్ఛమైన ఆహారం విషయ అధ్యయనంలో భాగంగా చిన్నారులు స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కూరగాయలు, మార్కెట్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడడంతో భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులు, రోగాలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజితవేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రతినిధులు మాధవిలత, ప్రతిభ, విద్యార్థులు పాల్గొన్నారు.

డీడీలు చెల్లించి నాణ్యమైన విద్యుత్‌ను పొందాలి

గజ్వేల్‌రూరల్: వ్యవసాయ బావుల వద్ద పంటలు సాగుచేసే రైతులు డీడీలు చెల్లించి నాణ్యమైన విద్యుత్‌ను పొందాలని రాయపోల్ విద్యుత్‌శాఖ ఏఈ వాసుదేవరావు సూచించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ మండలం బెజుగామ, ఆరెపల్లి(ఎస్‌బీ) గ్రామాలకు చెందిన రైతులు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగిస్తుండడంతో అధిక భారంతో ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోతుందన్నారు. డీడీలు చెల్లించి విద్యుత్‌ను వినియోగించుకుంటున్న రైతులతో పాటు డీడీలు చెల్లించని రైతులు ఎవరైన ఉంటే వెంటనే చెల్లించాలన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, రైతులకు ఇబ్బందులు తెలత్తకుండా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి రైతులకు అందించడంతో పాటు అదనంగా మరో 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందించినట్లు చెప్పారు. రెండు, మూడు రోజుల్లో మరో 2 ట్రాన్స్‌ఫార్మర్ల(25కేవీ)ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆధారపడకుండా మిగతా రైతులు డీడీలు చెల్లించి నాణ్యమైన విద్యుత్‌ను వినియోగించుకోవాలని, అక్రమంగా విద్యుత్‌ను పొందే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సూచించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు భవన నిర్మాణ పనులు, వైకుంఠధామాలను శనివారం కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, కమిషనర్ విద్యాధర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వినూత్న పథకాలను చేపట్టి అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడమే గాకుండా అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, దయానందరెడ్డి, నిమ్మ రమేశ్, ప్రవీణ్, కృష్ణ, మైపాల్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

జిల్లా వ్యాప్తంగా ఇంగ్లిష్‌పై విద్యార్థులకు ప్రతిభా పోటీలు



హుస్నాబాద్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



దుబ్బాకటౌన్: బహుమతులు అందుకున్న విజేతలు

హుస్నాబాద్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శనివారం మండలస్థాయి ఆంగ్ల భాష ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే ఇంగ్లిష్ తప్పనిసరి అని, మార్పులకు అనుగుణంగా విద్యార్థులు మారి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాధాకిషన్, ఆంగ్ల భాష టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పంజా రాజమల్లు, గైడ్ టీచర్స్, ఆంగ్ల ఉపాధ్యాయులు కృష్ణ, అనిత, వీరారెడ్డి, భాస్కర్, సుభాష్ పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివి ఆంగ్ల భాషపై భయం వీడాలని ఎంఈవో సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని బూర్గుపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయవర్ధన్‌రెడ్డి, మండల స్థాయి ఆంగ్లభాష ఉపాధ్యాయుల కమిటీ బృందం జానకీరామ్‌రెడ్డి, బుచ్చిరాములు, మోహన్‌రావు, మహేందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కరీమొద్దీన్, వాయిద్‌పాషా, శోభారాణి, కృష్ణలతో పాటు ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో ఇంగ్లిష్ డెవలప్‌మెంట్ స్కిల్స్ కోసం మూడు విభాగాల్లో 8, 9 తరగతుల విద్యార్థులకు శనివారం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

ములుగు(గజ్వేల్): ములుగు మండలం క్షీరసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మల్లేషం, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరు హైస్కూల్‌లో శనివారం ఆంగ్లభాషపై విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. విజేతలను జిల్లా పోటీలకు పంపుతున్నట్లు ఎంఈఓ సునీత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ నర్సింలు, ఎల్లా మండల కన్వీనర్ నర్సింహరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సుబ్రహ్మణ్యేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, కనకరాజు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ కీలకం

దుబ్బాకటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పెల్ విజార్డ్ అండ్ స్టోరీ టెల్లింగ్ విజేతలకు ఎంఈఓ ప్రభుదాసు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు గాజుల రాంచంద్రం, శ్రీనివాస్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ విష్ణువర్ధన్, ఎల్టా కన్వీనర్ సయ్యద్ ముజీబ్ అలీ, ఉమామహేశ్వర్, న్యాయనిర్ణేతలుగా రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, గాయత్రి, శైలజతో పాటు మండలంలోని 20 ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): ఉన్నత విద్యాభ్యాసానికి ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఎంతో కీలకమని హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం నంగునూరు పాఠశాలలో మండలస్థాయి ప్రతిభ పోటీలు నిర్వహించారు. స్పెల్ విజర్డ్ విభాగంలో నర్మేట పాఠశాల విద్యార్థి అవినాశ్‌రెడ్డి ప్రథమ, అంక్షాపూర్ పాఠశాల విద్యార్థి అక్షయ ద్వితీయ బహుమతి సాధించారు. స్టోరీ టెల్లింగ్ విభాగంలో నంగునూరు ఉన్నత పాఠశాలకు చెందిన శరణ్య ప్రథమ, బద్దిపడగకు చెందిన వినిత ద్వితీయ బహుమతి సాధించగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈఎల్‌టీఏ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎల్లం, కన్యాలాల్, నాగరాణి, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

జడ్జి శివరంజని



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని, జీవితంలో చెడుకు తావివ్వకుండా ఉన్నత విద్య వైపు పయనించాలని హుస్నాబాద్ సివిల్ జూనియర్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం సివిల్ లీగ్రసరి క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాలికలు, మహిళల రక్షణ, భద్రతపై ఎన్నో చట్టాలను రూపొందించామన్నారు. ప్రతీ విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అమ్మాయిలను ఎవరైన వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా నిర్భయంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. చదువుపై దృష్టి సారించి జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఏజీపీ రామకృష్ణ, న్యాయవాదులు డికొండ ప్రవీణ్, సంపత్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల సేకరణ హర్షణీయం



విత్తనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చిన్ననాటి నుంచే విత్తనాల ఉపయోగాలు తెలుసుకోవడంతో పాటు వాటిని సేకరించడం హర్షణీయమని సిద్దిపేటఅర్బన్ మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక రవీంద్ర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు 120 రకాల విత్తనాలతో సీడ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారి యాదవరెడ్డితో కలిసి ప్రారంభించి ఎగ్జిబిషన్లు తిలకించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రదర్శన నిర్వహించడం చాలా అభినందనీయమని, విత్తనాల ఉపయోగం గురించి విద్యార్థులు అందరికీ తెలియజేయాలని సూచించారు. పాతకాలపు ఆహారపు సిరిధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, రాగులు, సజ్జలు పెసలు, అవిసెలు, అద్భుతమైన పీచు అంశంతోనే మనకు ఆరోగ్యం కలుగుతుందని, మనిషికి కావాల్సిన సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగించే అంశాలు ఈ సిరిధాన్యాల్లో ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరికిషన్, సైన్స్ ఉపాధ్యాయులు శ్యాంకుమార్, మమత, శిరీష, ఉపాధ్యాయ బృందం, తల్లితండ్రులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

సిద్దిపేటఎడ్యుకేషన్: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు చూపరులను అలరించాయి. విద్యార్థులు వేసిన ముగ్గులను కళాశాల ప్రిన్సిపాల్ సీతారాములు, వైస్ ప్రిన్సిపాల్ సంధ్య అభినందించారు.

హుస్నాబాద్: పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో పద్మావతి మహిళా గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి పాల్గొన్నారు. మహిళలు సాంప్రదాయమైన చుక్కల ముగ్గులు వేసి అందరినీ ఆకర్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి గ్రూప్ అధ్యక్షురాలు వడ్డెపల్లి అరుణ, ప్రధాన కార్యదర్శి వెల్దండి శారద, మండల పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు పంతం కన్యాకుమారి, ప్రధాన కార్యదర్శి సబ్బని శ్రీదేవి, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

దుబ్బాక: బడీడు పిల్లలంతా బడిలోనే ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలని సీఆర్పీ గణేశ్, ఉపాధ్యాయుడు నర్సింహరెడ్డి కోరారు. శనివారం దుబ్బాక పట్టణంలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 6–19 సంవత్సరాల పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. నేటి సమాజంలో చదువు ఎంతో ముఖ్యమని, సమాజం అభివృద్ధి చెందాలంటే వందశాతం అక్షరాస్యత సాధించాలన్నారు. అలాగే రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో సీఆర్పీ యాదగిరి ఆధ్వర్యంలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, తదితరులున్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



అభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేటలో శనివారం పెద్దమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి 41 కలశాలతో దుర్గాసుక్తుల మధ్య పసుపు, కుంకుమతో అభిషేకం వేద పండితుడు ఆనందశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకు ముందు ముదిరాజు కులస్తులు డప్పు చప్పుళ్లతో పుట్టను కమ్మె కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో అసెంబ్లీ పాలక్ ఇన్‌చార్జ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పాలనపై ఎమ్మెల్యే కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలోని 253 బూత్‌ల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బూత్ కమిటీ సభ్యులతో వర్చ్యువల్ ప్రోగ్రామ్‌లో పాల్గొని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, కోకన్వీనర్ గోవింద్, నాయకులు సంతోష్, రోశయ్య, కిషన్, స్వామి, వెంకట్‌గౌడ్, చంద్రం, దేవరాజు ఉన్నారు.

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న రాచరికపు పాలనను అంతమొందించేందుకు ప్రతీ కార్యకర్త ముందుండి పోరాడాలని గజ్వేల్ నియోజకవర్గ పాలక్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రసంగాన్ని లైవ్‌లో గజ్వేల్‌లో బీజేపీ అసెంబ్లీ బూత్ అధ్యక్షులు, సభ్యులు కలిసి తిలకించారు. ఈ సందర్భంగా బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

హుస్నాబాద్: బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించారు. వర్చ్యువల్ మీటింగ్‌లో బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ బూత్ ప్రసంగాన్ని వీక్షించారు. సమావేశంలో హుస్నాబాద్ అసెంబ్లీ పాలక్ డాక్టర్ సంతోష్, ప్రభారి గుజ్జు సత్యనారాయణరావు, నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జాయింట్ కన్వీనర్ వేణుగోపాల్‌రావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, వివిధ మండలాల అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



కోహెడ ఎంపీపీఎస్‌లో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నవ్య

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.కోటి 21లక్షల 90 వేలు నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు సర్పంచ్ పెరియాల నవ్య తెలిపారు. శనివారం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనులను ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఎన్టీఆర్ కాలనీలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రూ.30లక్షల 40వేలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.51లక్షల 60వేలు, అలాగే పోలీస్‌స్టేషన్ సమీపంలోని మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.39లక్షల 90వేలు ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైనట్లు తెలిపారు. నిధులను పాఠశాల కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్, టాయిలెట్స్ బ్లాక్‌లకు నిధులు సద్వినియోగం చేయనున్నట్లు చెప్పారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లకు సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోహెడ ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు, మాజీ సర్పంచ్ దొమ్మాట జగన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, అశోక్, రాజవ్వ, వెంకటస్వామి, కవిత, హెచ్‌ఎం రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ హరిప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ రంగానాయక్, టీఏ భాస్కర్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను విజయవంతం చేయాలి



చేర్యాల(సిద్దిపేట): మాట్లాడుతున్న ఎంపీపీ కరుణాకర్, తదితరులు



దుబ్బాకలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వనిత, ఉపవైద్యాధికారి శ్రీనివాస్

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 18వ తేదీన ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2వ విడత కంటి వెలుగు కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీపీ కరుణాకర్ మాట్లాడుతూ.. మొదటి విడత ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18వ తేదీన ప్రారంభమై 144రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎంపీడీఓ అన్వర్, ఎంపీఓ మెహబూబ్ అలీ, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, ముస్త్యాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నాజియా, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో విజయవంతం చేద్దామని చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై కమిషనర్ గణేష్‌రెడ్డితో కలిసి కౌన్సిలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భార్గవి ఉన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై మండల ప్రజాప్రతినిధులకు, అధికారులకు వైద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ లింగాల నిర్మల, వైద్యాధికారి వినోద్‌బాబ్జి, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎంపీడీఓ రాము, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎంపీపీ తలారి కీర్తన, ఎంపీడీవో అనురాధ, ఎంపీవో మంజుల, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై ఎంపీపీ కొత్త పుష్పలత అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ భాస్కరశర్మ, మెడికల్ ఆఫీసర్లు భార్గవి, హిమబిందూ, వైస్ ఎంపీపీ అస్క రవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాలిగామ లత అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో కంటివెలుగు కార్యక్రమ జిల్లా అధికారిణి రజిత, ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి, జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, ఎంపీఓ ఖలీమ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై మండల వైద్యాధికారి రజిత ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మోడల్ స్కూల్ హాస్టల్‌కు ఎన్‌ఆర్‌ఐ దంపతుల సహకారం**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్ హాస్టల్‌కు అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ దంపతులు పెడతల బాలమణి, ప్రతాప్‌రెడ్డి రూ.55వేల విలువగల వస్తువులను అందజేశారు. ఇటీవల గ్రామానికి వచ్చిన వారు స్థానిక మోడల్ స్కూల్ హాస్టల్ భవనాన్ని సందర్శించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. వెంటనే స్పందించి రూ.25వేల విలువైన ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఎల్‌ఈడబు డూమ్ లైటు ఏర్పాటు చేయడంతో పాటు రూ.30వేల విలువైన సేఫ్టీ గేటు చేయించి అందించారు. వారి వెంట సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డి, హాస్టల్ ఇన్‌చార్జ్ నజియాసల్మా, సిబ్బంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ దంపతులకు గ్రామస్తులు, హాస్టల్ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

◆ **అర్హులకే ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి**

హుస్నాబాద్: అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి సొంతింటి కలను నిజం చేయాలని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు విచారణను న్యాయంగా జరిపి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తావు ఇవ్వకుండా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్టు సాయి, బడుగుల రమేశ్ తదితరులు ఉన్నారు.

◆ **పాఠశాల ఆవరణలో ఆడిటోరియం నిర్మాణం సరికాదు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఆడిటోరియం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్క సతీశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు అన్నారు. శనివారం ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎంకు పూర్వ విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఫయాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు గయాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి**

కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. మండలంలోని బస్వాపూర్, పోరెడ్డిపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామశాఖ అధ్యక్షులను నియమించారు. బస్వాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా ప్రవీణ్, పోరెడ్డిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

◆ **జర్నలిస్టుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి**

దుబ్బాక: టీయూడబ్ల్యూజే-(హెచ్-143) సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిస్టుల రాష్ట్ర ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని దుబ్బాక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజమల్లు అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి చేతుల మీదుగా టీయూడబ్ల్యూజే-(హెచ్-143) రాష్ట్ర ద్వితీయ మహాసభల మరియు ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) పదవ జాతీయ ప్లీనరీ సమావేశాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

◆ **బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి**

హుస్నాబాద్: బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి బీసీలకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 8 ఎనిమిది సంవత్సరాలుగా బీసీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఒక వైపు ఉద్యోగ నోటిఫికేషన్లు రాకుండా వయోభారం పెరిగి ఉద్యోగాల్లో అర్హతలు కోల్పోయారన్నారు. బీసీలతో పాటు మైనార్టీలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు.

◆ **వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా ఆస పెద్దముత్యం**

దుబ్బాకటౌన్: వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా దుబ్బాక పట్టణానికి చెందిన ఆస పెద్ద ముత్యం నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కుంబాల రవి నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్ద ముత్యం మాట్లాడుతూ.. వినియోగదారులకు అండగా ఉండి వారికి జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవికి కృతజ్ఞతలు తెలిపారు.

వైదిక పాఠశాల రజతోత్సవాన్ని జయప్రదం చేయండి

సిద్దిపేటఅర్బన్: సదానంద భారతి తీర్థ వైదిక పాఠశాల రజతోత్సవాన్ని ఈనెల 9వ తేదీన కొండ మల్లయ్య గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు వైదిక పాఠశాల ట్రస్టు అధ్యక్షుడు సత్యనారాయణశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని కిష్టసాగర్ సమీపంలో గల సదానంద భారతి తీర్థ వైదిక పాఠశాలలో రజతోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, శారదా పీఠం సీఈఓ, అడ్మినిస్ట్రేటర్ గౌరీ శంకర్, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు రమణ చారి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కరపత్రం ఆవిష్కరించిన వారిలో నాగరాజుశర్మ, శారద ప్రసాద శర్మ తదితరులు ఉన్నారు.

సన్మానం



చంద్రశేఖర్‌రెడ్డి, మాధవి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా ఇటీవల ఎంపికయ్యారు. ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి, మాధవి ఎంపీటీసీ దంపతులను ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, వైస్ ఎంపీపీ అస్క రవి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చందసాగర్ పాల్గొన్నారు.